క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన ఎస్సై బి.గణేష్

నెల్లిమర్ల: మండల పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా బి. గణేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన డి.రామగణేష్‌కు దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. జిల్లా కేంద్రంలో డీసీఆర్‌బీ ఎస్సైగా పని చేస్తున్న గణేష్ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

ఆర్థిక సాయం


బాధితుడు కాంతారావు కుమార్తెకు ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ వ్యవస్థాపకురాలు హేమ, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామానికి చెందిన కిలారి కాంతారావు కొంత కాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యానికి ఇబ్బంది పడుతున్నారు. దీంతో గ్రామానికి చెందిన మజ్జి రామారావు అభ్యర్థన మేరకు శ్రీకాకుళానికి చెందిన గ్రేస్ హెల్పింగ్ హ్యాండ్స్ అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు దాశెట్టి హేమ మానవతా దృక్పథంతో స్పందించి రూ. 50 వేలను ఆదివారం బాధితుడి కుమార్తెకు అందజేశారు. అలాగే డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ చనమళ్ల వెంకటరమణ రూ.5వేలను అందించారు. బాధితుడ్ని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి తేజేశ్వర్ కుమార్, స్థానికులు సూర్య భాస్కరరావు, మజ్జి గణపతి, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు...


భోగాపురం: బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

భోగాపురం: మండలంలోని దిబ్బలపాలెం గ్రామంలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పెంటిమాని రాము, సీతమ్మ దంపతులకు చెందిన పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నిత్యావసర సరుకులతో పాటు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వందనాల రమణ, నాయకులు బొల్లు త్రినాథ్, నీలాపు ఈశ్వరరావు, బంగారు రెడ్డి, బైరెడ్డి రామకృష్ణ, శీరపు జయరామ్, మురళి, చిన్ని, శివాజీ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

- సెంచూరియన్ వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి


మాట్లాడుతున్న సెంచూరియన్ వీసీ పీకే మహంతి

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రశాంతకుమార్ మహంతి పిలుపునిచ్చారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ పరిశ్రమల్లో విద్యార్థులు ఉద్యోగాలు సాధించాలంటే వారిలో సామర్థ్యాలు, నైపుణ్యాలు పెరగాలన్నారు. అందుకు అవసరమైన తర్ఫీదును వర్సిటీలో అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఎలా చదువుతున్నదీ, తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ సన్నీడ యోల్, డాక్టర్ పుష్పలత, హెచ్‌ఓడీ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ ఆచార్యులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకాలు


అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి అర్చకులు ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. వేకువ జామున 4 గంటలకు అభిషేకాలు ప్రారంభించారు. అనంతరం అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. పలువురు భక్తులు ప్రభలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం దేవస్థానం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ దాతల సహకారంతో అన్నదానం చేశారు.

అంతర పంటలతో అధిక ఆదాయం..

- అన్నదాతకు ఆర్థిక భరోసా

పూసపాటిరేగ : ఉద్యానవన సాగులో అంతర పంటలు వేయడంతో రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. జిల్లాలో తీరప్రాంత మండలాలైన పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో అత్యధికంగా కొబ్బరి సాగవుతోంది. వాటిలో అంతరపంటగా అరటి, జామి, కోకో, తదితర పంటలు వేసి రైతులు ఆర్థికంగా ఎదుగుతున్నారు. రైతులు కొబ్బరిసాగుతో పాటు అదనపు ఆదాయం కోసం జామి, కోకో, అరటి పంటలు వేసి స్థానిక మార్కెట్‌లో పంటలను విక్రయిస్తున్నారు. దీంతో ఎకరాకు సుమారు రూ. 50 వేల నుంచి 70 వేల రూపాయల వరకు ఆర్జిస్తున్నారు. జిల్లాలోనే అత్యధికంగా తీర ప్రాంత మండలాల్లో సుమారు 10 వేల ఎకరాలలో కొబ్బరిసాగు జరుగుతోంది. వాటిలో అంతర పంటలుగా సుమారు 6500 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. తీరప్రాంత గ్రామాలైన చింతపల్లి, కొణతాలపాలెం, కృష్ణాపురం, చొడువాడ, రోలుచప్పిడి, చినపతివాడ, పెదపతివాడ, రాయుడుపేట, కోనయ్యపాలెం, ముక్కాం, చేపలకంచేరు, దిబ్బలపాలెం, గూడపువలస గ్రామాలలో అత్యధికంగా కొబ్బరి సాగు చేస్తున్నారు.


పతివాడలో కొబ్బరిసాగులో అంతరపంటగా వేసిన అరటిసాగు

అంతర పంటతో తెగుళ్ల నివారణ..

ఉద్యానవన సాగులో అంతర పంటలు వేస్తే భూములకు మేలు జరుగుతుంది. అంతరపంటల వల్ల తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుంది. అంతర పంటలతో తక్కువ కాలంలోనే ఫలసాయం పొందవచ్చు.అలాగే భూసారం పెరుగుతుంది.

– జ్యోత్స్న, ఉద్యానవన శాఖాధికారి

లాభాలు ఆర్జిస్తున్నాం..

కొబ్బరిసాగులో అరటి వేయడంతో లాభాలు ఆర్జిస్తున్నాం. ఒకే భూమిలో రెండు రకాలు ఏక కాలంలో సాగు చేస్తున్నాం. ఒక పంట ఆదాయం పెట్టుబడులకు పోయినా రెండో పంట ఆదాయం పనికొస్తుంది.

– పి. రామునాయుడు, రైతు, పతివాడ

అధిక ఆదాయం..

కొబ్బరిలో కోకో, జామి అంతర పంటలుగా వేయడంతో లాభాలు వస్తున్నాయి. కొంత కాలంగా తీర ప్రాంతంలో కొబ్బరి రైతులు అంతర పంటలు వేసి ఆదాయం ఆర్జిస్తున్నారు. దుక్కులు ఎక్కువగా చేయాల్సి రావడంతో నేల సారవంతం అవుతోంది.

– ఎ. అశ్విని, మహిళారైతు, పతివాడ

నగరంలో స్వచ్ఛ భారత్ ర్యాలీ



'స్వచ్ఛ భారత్' ర్యాలీలో బ్యాంక్ ఉద్యోగులు

విజయనగరం అర్బన్: యూనియన్ బ్యాంక్ కేంద్ర కార్యాలయం సూచన మేరకు విజయనగరం రీజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో బ్యాంక్ ఉద్యోగులు ఆదివారం పట్టణంలోని వివిధ ప్రాంతాలలో 'స్వచ్ఛ భారత్' కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని చెద్దచెరువు చుట్టూ ఉన్న చెత్తా,చెదారాలను ఏరివేశారు. అనంతరం మయూరీ కూడలి నుంచి రైల్వేస్టేషన్ మీదుగా వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం కూడలి వరకు స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ నరేష్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ హరిప్రసాద్, శ్రీనివాస్, సీనియర్ మేనేజర్ మల్లేశ్వరరావు, యూనియన్ నాయకులు నాగరాజు, మురళీశ్రీనివాస్, శ్రావణ్, వివిధ బ్రాంచ్‌ల మేనేజర్లు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి సహస్ర దీపాలంకరణ సేవ


దీపాలంకరణ సేవలో వేంకటేశ్వరస్వామి ఒడిలో వినాయకుడు

విజయనగరం టౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని స్థానిక రంగాలవీధిలో ఆదివారం రాత్రి కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ఒడిలో వినాయకుడు ఉన్నట్లు ఉప్పుతో చిత్రీకరించి, సహస్ర దీపాలతో అలంకరణ చేశారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సేవలందించారు. గణనాథునికి నైవేద్యంగా సమర్పించిన 21 కిలోల లడ్డూకు సోమవారం వేలం పాట వేస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి భక్తులందరూ హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం రూరల్: నగర ప్రజల నుంచి కుళాయి కనెక్షన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200, ఆరువేల రూపాయల కనెక్షన్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు సచివాలయం ద్వారా లేదా స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే సమయానికి ఆస్తి పన్ను చెల్లించి ఉండాలన్నారు.

వరద బాధితులకు సేవలు..


విజయవాడలో వరద బాధితులకు సాయమందిస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: జిల్లాకు చెందిన అమ్మా సేవా ఫౌండేషన్, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్, అభ్యుదయ ఫౌండేషన్ సభ్యులు గుంటూరు జిల్లా తాళ్లాయిపాలెం, విజయవాడ పరిసర ప్రాంతాలకు చెందిన వరద బాధితులకు ఆదివారం సహాయ కార్యక్రమాలు చేపట్టారు. బాధితులకు అవసరమైన మందులు, నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, విద్యార్థులకు అవసరమైన విద్యాసామాగ్రి అందించారు. మూడు రోజులుగా విజయవాడలో ఉంటూ సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని సంస్థ ప్రతినిధులు దేవరపు సురేష్, సాయి, డాక్టర్ చింత శారద తెలిపారు.

రేషన్ బియ్యం పక్కదారి

- యథేచ్ఛగా రైస్ మిల్లులకు రేషన్ బియ్యం
- డీలర్ల నుంచే తరలిపోతున్నాయన్న అనుమానాలు
- బ్లాక్ మార్కెట్‌లో కిలో రేషన్ బియ్యం రూ.20
- నియోజకవర్గంలో ఇటీవల 45 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత
- పౌరసరఫరాలశాఖ పర్యవేక్షణ కొరవడడమే కారణమా..?

నియోజకవర్గంలో మండలాల వారీగా రేషన్ డిపోలు, రేషన్ కార్డుల వివరాలు....

మండలం	రేషన్ డిపోలు	రేషన్‌కార్డులు
చీపురుపల్లి	43	18,223
గరివిడి	46	21,100
మెరకముడిదాం	44	18,200
గుర్ల	45	20,560


2024 సెప్టెంబర్ 20న గరివిడిలో పట్టుబడిన 6,724 కిలోల బియ్యంను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన అధికారులు(ఫైల్)

చీపురుపల్లి: చౌక దుకాణాల ద్వారా పేదలకు కిలో రూ.2కే అందాల్సిన బియ్యం పక్కదారి పడుతోంది. పౌరసరఫరాలశాఖ నుంచి చౌకదుకాణాలకు చేరుతున్న బియ్యం అక్కడి నుంచి లబ్ధిదారులకు చేరకుండా తిరిగి బ్లాక్‌మార్కెట్ ద్వారా రైస్ మిల్లులకు చేరుతోంది. 'దొరికితే దొంగ.. లేకుంటే దొర' అన్న చందంగా ఇక్కడ బ్లాక్‌మార్కెట్ పరిస్థితి తయారయ్యింది. అక్కడక్కడ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించే దాడుల్లో పట్టుబడిన వారు బయటకొస్తున్నప్పటికీ ఇంకా చాలా వరకు పబ్లిక్ బియ్యం పక్కదోవ పడుతోందనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేషన్ బియ్యం యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌లోకి పోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ మూడు నెలల్లో నియోజకవర్గంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నేతృత్వంలో పౌరసరఫరాలశాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన 45.30 టన్నుల బియ్యమే ఇందుకు ఉదాహరణ. 2024 ఆగస్టు 9న చీపురుపల్లి మండలంలోని మెట్టపల్లి గ్రామంలో 690 కిలోల బియ్యం, 2024 సెప్టెంబర్ 12న మెరకముడిదాం మండలంలోని గర్భాం పరిసర ప్రాంతాల్లో 37,600 కిలోల బియ్యం, 2024 సెప్టెంబర్ 20న గుర్ల మండలంలోని శేరీ పేట నుంచి గరివిడి మీదుగా తరలిస్తున్న 6,742 కిలోల బియ్యంను విజిలెన్స్ అధికారులు పట్టుకుని పౌరసరఫరాలశాఖ అధికారులకు అప్పగించారు.


2024 ఆగస్టు 9న చీపురుపల్లి మండలంలోని మెట్టపల్లిలో పట్టుబడిన రేషన్ బియ్యం(ఫైల్)

కిలో రూ.20 వరకు కొనుగోలు....

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 178 చౌకదుకాణాలు, 78,083 రేషన్‌కార్డులు ఉన్నాయి. రేషన్‌కార్డుల్లో ఒక్కో లబ్ధిదారునికి 5కిలోల చొప్పున ప్రతి నెలా చౌక దుకాణాల ద్వారా బియ్యం సరఫరా జరుగుతోంది. ఆ బియ్యం ఇచ్చిన వెంటనే దళారులు రంగంలోకి దిగి తిరిగి కిలో రూ.16 నుంచి రూ.20 వరకు చెల్లించి లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. లబ్ధిదారుల వద్ద కొనుగోలు చేసిన బియ్యాన్ని తిరిగి రైస్‌మిల్లులకు, పెద్ద వ్యాపారులకు అధిక లాభాలకు విక్రయించుకుంటున్నారు.

కేసులు నమోదు చేస్తాం....

రేషన్ బియ్యం బయట మార్కెట్‌లో విక్రయించిన వారిపై 6 ఏ కేసులు నమోదు చేస్తున్నాం. అంతేకాకుండా రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినా, రవాణా చేసినా సరే కేసులు నమోదు తప్పదు. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతున్నాం.

– పిన్నింటి రామారావు, సీఎస్‌డీటీ, చీపురుపల్లి

నేత్రదానం మహాదానం

- ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటిండెంట్ అప్పలనాయుడు


కార్నియా సేకరిస్తున్న టెక్నీషియన్ రమణ

విజయనగరం ఫోర్ట్: నేత్రదానం మహాదానమని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటిండెంట్ సంబంగి అప్పలనాయుడు అన్నారు. గరివిడి మండలం సరిపేట గ్రామానికి చెందిన తెలుగు సూరమ్మ అనే వృద్ధురాలు మూడు రోజుల కిందట అనారోగ్యంతో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరి ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆప్తాలమిక్ ఆఫీసర్లు జి. వెంకటేశ్వరావు, బి. తారకేశ్వరావు కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించడంతో వారు నేత్రదానానికి అంగీకరించారు. దీంతో రెడ్‌క్రాస్ సొసైటీ ఐ డోనేషన్ సెంటర్ టెక్నీషియన్, సర్వజన ఆస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ బోళం పద్మావతి ఆధ్వర్యంలో మృతురాలి కార్నియాను సేకించారు. నేత్రదానానికి అంగీకరించిన మృతురాలి కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా సూపరింటిండెంట్ అభినందించారు.

తాగునీరు అందించడమే లక్ష్యం..


పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, తదితరులు

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి

డెంకాడ: ఇంటింటి కుళాయిల ద్వారా ప్రజలందరికీ తాగునీరు అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని మోపాడలో ఆదివారం పర్యటించి మొక్కలు నాటారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జమదగ్ని, ఎంపీడీఓ స్వరూపారాణి, తహసీల్దార్ పద్మావతి, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, కర్రోతు బంగార్రాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కంది సూర్యనారాయణ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సంఘ సభ్యుల అభ్యున్నతికి కృషి చేయండి


కృష్ణవంశీని సన్మానిస్తున్న ఎస్ఈ లక్ష్మణరావు

- ఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు

విజయనగరం ఫోర్ట్: సంఘ సభ్యుల అభ్యున్నతికి సంఘ ప్రతినిధులు కృషి చేయాలని ఈపీడీసీఎల్ ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు సూచించారు. ఆదివారం స్థానిక దాసన్నపేటలో గల విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104) కార్యాలయంలో శ్రీ వేంకటేశ్వర విద్యుత్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ మహాజన సభ సొసైటీ అధ్యక్షుడు పతివాడ రామునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన సంఘ సభ్యుల పిల్లలకు ప్రోత్సాహకాలు అందజేశారు. అదేవిధంగా విజయనగరం విద్యుత్ భవన్‌లో పనిచేస్తున్న జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కంటుభుక్త నాగరాజు కుమారుడు కృష్ణవంశీ చిత్తూరు జిల్లా పుంగనూరులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులు కావడంతో ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో 1104 సంఘ కార్యదర్శి సురగాల లక్ష్మణ, గనివాడ అప్పలనాయుడు, సారిక మురళి, అప్పలసూరి, ఎన్. రమణ, తదితరులు పాల్గొన్నారు.

అందని వంట నూనె..!



పెదమేమలి అంగన్‌వాడీ కేంద్రం

- సెప్టెంబర్‌కు సంబంధించి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా కాని వంట నూనె
- గంట్యాడ ప్రాజెక్టు పరిధిలో 166 కేంద్రాలు
- 50 కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు నేటికీ అందని నూనె

గంట్యాడ: పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ఎన్‌డీఏ ప్రభుత్వం చిత్తశుద్ధి కనబరచడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందించాల్సిన సౌకర్యాలు, సరుకులను అందించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీ నెల ఏదో ఒక వస్తువు సరఫరాలో జాప్యం చేస్తుండడంతో లబ్ధిదారులు ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి. సెప్టెంబర్ నెలకు సంబంధించి గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేయాల్సిన వంట నూనెను ఇంత వరకు అందించలేదు. కొన్ని కేంద్రాలకు మాత్రమే సరఫరా చేసి మిగతా కేంద్రాలను విస్మరించారు.

గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో...

గంట్యాడ ప్రాజెక్టు పరిధిలో 166 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. గంట్యాడ మండలంలో 96, బొండపల్లి మండలంలో 70 కేంద్రాలు ఉన్నా యి. వీటి పరిధిలో 514 మంది గర్భిణులు, 455 మంది బాలింతలు, 3,483 మంది పిల్లలు ఉన్నారు. వీరికి రోజూ పప్పు లేదా కూరగాయలతో కూడిన భోజనం, 100 మిల్లీలీటర్ల పాలు ఇస్తారు. గర్భిణులు, బాలింతలకు బెల్లం, వేరుశనగ చెక్కీలు, రాగి పిండి, అటుకులు, కర్జూరంతో పాటు, ఐదు లీటర్ల పాలు, కిలో కందిపప్పు, అర లీటర్ వంట నూనెను ప్రతీ నెల ఇంటికి అందిస్తారు. గంట్యాడ ప్రాజెక్టు పరిధిలోని 969 గర్భిణులు,బాలింతలకు ఒకొక్క రికీ నెలకు అరలీటరు చొప్పున పంపిణీ చేసేందుకు 484.50 లీటర్ల నూనె అవసరం. అయితే గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 116 కేంద్రాల కు మాత్రమే సెప్టెంబర్ నెలకు సంబంధించి వంట నూనె సరఫరా చేశారు. 50 కేంద్రాలకు ఇంక సరఫరా చేయలేదు. మరో వారం రోజుల్లో సెప్టెంబ ర్ నెల పూర్తి కానుంది. ఇప్పటి వరకు నూనె సరఫరా చేయకపోవడంతో ఈనెలకు సంబంధించి వంట నూనె ఇక ఇవ్వరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే నూనె ప్యాకెట్లు

వస్తే పంపిణీ చేస్తాం

గంట్యాడ ప్రాజెక్ట్ పరిధిలో 50 కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఈనెలకు సంబంధించి వంట నూనె ఇంకా సరఫరా కాలేదు. స్టాక్ వచ్చిన తర్వాత పంపిణీ చేస్తాం.

– దోకుల ఉమాభారతి, ఐసీడీఎస్ పీఓ , గంట్యాడ ప్రాజెక్టు